ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు



పత్తి పొలంలో పనిచేస్తున్న కర్ణాటక రాష్ట్రం సిరిగుప్ప నుంచి వచ్చిన కూలీలు

పత్తికి కూలీల పాట్లు

ఆదోని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు కూలీలు దొరకడం లేదు. కర్నూలు జిల్లాలో దాదాపు 2.17వేల హెక్టార్లలో పత్తి పంటను సాగు చేశారు. ఆదోని సబ్‌డివిజన్‌లో 67వేల హెక్టార్లలో పత్తి పంటను సాగుచేశారు. ఆదోని ప్రాంతంలో కూలీల కొరత ఏస్థాయిలో ఉందంటే.. కూలి రేట్లు ఆకాశాన్ని అంటుతున్నాయి. గత ఏడాది కిలో పత్తి పంటతీతకు కేవలం రూ.7 ఇస్తే సరిపోయేది. కానీ ఈ సంవత్సరం కూలీ డిమాండ్ దృష్ట్యా ఆరేటును రైతు లు కళ్ళు మూసుకుని రూ.13 నుంచి రూ.15 వరకు పెంచారు. దాదాపుగా రేటు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగినా, కూలీలు దొరకక పత్తితీత పనులు పూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో ఎక్కడ వర్షం కురిసినా ఇక్కడి రైతులు భయం భయంగా గడుపుతున్నారు. పత్తి పంటలకు అధిక పెట్టుబడి పెట్టడం, పెరిగిన కూలీ రేటుతో సతమతమవు తుంన్న రైతును వాతావరణం మరింత భయపెడు తోంది. వర్షం ముప్పు రైతుల గుండెల్లో దడ పెడుతోం దని, వర్షం పడితే.... పత్తి పంట మొత్తం నేలపాలవు తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట తీయడానికి మనిషి దొరక్క చేతికొచ్చిన పంట కళ్ల ముందే నాశనమవుతుందేమోనని భయమేస్తోందని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు రైతులు. రోజులు గడిచే కొద్దీ పొలంలో దూది నేలరాలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే అప్పులు చేసి లక్షలు వెచ్చించి పండించిన పంటను నేలకే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడితే... తమ బతుకులు రోడ్డున పడతాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పత్తి పంట పండింది ఇలా..

'ఉపాధి', ఇతరత్రా పనుల వైపు..

పత్తి తీసే యంత్రాలు అందుబాటులో లేకపోవడం, ఉపాధి హామీ పనులు, ఇతరత్రా పనుల వైపు కూలీలు మళ్లడంతో ఈ సంక్షోభం మరింత పెరిగిందని రైతులు చెబుతున్నారు. తక్షణమే జిల్లా అధికారులు చొరవ తీసుకుని, ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించడానికి లేదా తగిన ప్రత్యామ్నాయాలు చూప డానికి చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు. లేదంటే ఈ ఏడాది పత్తి పంట పండించిన రైతులకు నష్టాల తిప్పలు తప్పేలా లేవు.

- పత్తి తీతకు ఆకాశన్నంటుతున్న కూలి రేట్లు
- గతంలో రూ.7 .. ప్రస్తుతం రూ.15కు పెంపు
- కూలి పెంచినా దొరకని కూలీలు
- జిల్లాలో 2.17వేల హెక్టార్లలో సాగు
- వర్ష భయంతో రైతు గుండెల్లో దడ

సిరుగుప్ప నుంచి 30 మంది కూలీలను..



ఆరు ఎకరాల్లో పత్తి సాగుచేశా. ఏడు రోజులైంది. కూలీల కోసం ఊరంతా తిరుగుతున్నా... ఏ ఒక్క కూలీ దొరకడం లేదు. డబ్బులు ఎంతైనా ఇస్తామంటున్నా రైతులను అడిగే వారే లేరు. చివరికి కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప నుంచి 30 మంది కూలీలను సొంత వాహనాన్ని ఏర్పాటు చేసి తీసుకొచ్చా. ఒక్క కేజీ పత్తి తీతకు రూ.15 ఇస్తున్నా.

- నజీర్, రైతు, సంతేకూడ్లూరు

పెట్టుబడులు నేలపాలవుతాయని..



నాలుగెకరాల్లో పత్తిని సాగు చేశా. వర్షాలు ఎక్కువ కురవడంతో పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా పత్తికి కూలీలు దొరకడం లేదు. వర్షం వస్తే మాత్రం పత్తి పట నేలరాలుతుంది. పెట్టిన పెట్టుబడులంతా నేలపాలవుతాయని భయమేస్తోంది. వర్షం పడిందా మా బతుకులు మట్టిపాలే...

● నాగప్ప, రైతు, హోళగుంద

భూసేకరణ త్వరగా పూర్తిచేయండి

కలెక్టర్ సిరి



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సిరి ఏపీఐఐసీ జడ్‌ఎంను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఏపీఐఐసీ ప్రాజెక్టులు, భూసేకరణ అంశాలపై కలెక్టర్ ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు నీటి సరఫరా పైపులైన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మూడు కిలోమీటర్ల ఉన్న భూసేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు సంబంధించి అడ్వాన్స్ పొజిషన్ కోసం గానూ ఫైల్ సర్క్యులేషన్ చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. డ్రోన్ సిటీకి సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి పెగ్ మార్కింగ్ చేయాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్‌ఎంను ఆదేశించారు. జేసీ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఆర్డీవో సందీప్ కుమార్, ఏపీఐఐసీ జడ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ఐదు రోజులపాటు వానలు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఐదు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కేవీకే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 22వ తేదీ 10మి.మీ వర్షపాతం, 23వ తేదీన 15.4 మి.మీ, 24వ తేదీన 19.3 మి.మీ, 25వ తేదీన 16.7 మి.మీ, 26వ తేదీ 15.మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు. అలాగే ఈశాన్యం దిశగా గాలులు గంటకు 7 నుంచి 8 కి.మీ వేగంతో వీస్తాయన్నారు. రైతులు దీన్ని దృష్టిలో ఉంచుకొని పంటల సాగులో మెలకువలు పాటించాలన్నారు.

డీఎంహెచ్‌వో శాంతికళ బదిలీ

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా భాస్కర్



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో శాంతికళను డిప్యుటేషన్‌పై గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్‌గా బదిలీ చేశారు. కేవలం తొమ్మిది నెలల్లోనే బదిలీ కావడం చర్చనీయాంశమైంది. కార్యాలయానికే పరిమితం కావడం, క్షేత్రస్థాయి పర్యటనలు లేకపోవడంపై ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. పగిడ్యాలకు చెందిన ఓ గర్భిణికి కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ పరీక్ష, అబార్షన్ చేయగా వికటించి ఆమె మృతి చెందింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎల్. భాస్కర్‌ను నియమిస్తూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సౌరబ్‌గౌర్ ఆదేశాలు జారీ చేశారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



అమరుల స్మారక స్థూపానికి వందనం చేస్తున్న మంత్రి టీజీ భరత్, పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ నూరల్ ఖమర్ పాల్గొన్నారు. ముందుగా అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పెరేడ్ నిర్వహించారు. నిర్వహించి అమర పోలీసులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల త్యాగాలు మన గుండెల్లో నిలిచిపోతాయన్నారు. పోలీసులు నూతన టెక్నాలజీతో ముందుకు వెళ్తున్నారన్నారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం అంతకంటే ఏ త్యాగం లేదన్నారు. ఏ సంఘటన జరిగినా గుర్తుకొచ్చేది పోలీసులే అన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అంతర్గత శాంతి భద్రత, నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాడుతూ రాత్రి, పగలు విధి నిర్వహణలో ఏపీ, సెంట్రల్, గ్రేహౌండ్స్ పోలీసులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ అన్ని వ్యవస్థల కంటే పోలీసు వ్యవస్థలో పని చేయడం చాలా కష్టమన్నారు. అనంతరం అమరవీరులు యుడీ వెంకటేశ్వర్లు, అబ్దుల్ కరీం, కే.రాముడు కుటుంబ సభ్యులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నాగరాజు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం.మహేష్ కుమార్, ఏఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు బాబు ప్రసాద్, ఉపేంద్రబాబు, పోలీసు వెల్ఫేర్ స్రవంతి, సీఐలు, ఆర్ఐలు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.



అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి టీజీ భరత్

పది వేల ఎకరాలకు సాగునీరు

- రైతులను ఆదుకునేందుకు చర్యలు
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టు కింద రబీ సీజన్‌లో పదివేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, జీఆర్‌పీ ఈఈ మల్లికార్జున, ఎంఐ ఈఈ వెంకటరాముడు, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజవర్గంలో ఎల్లెల్సీ, జీడీపీ(గాజులదిన్నె ప్రాజెక్టు), జీఆర్‌పీ(గురు రాఘవేంద్ర ప్రాజెక్టు)లో సాగునీటి, పంటల సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లో రైతులకు రబీ సీజన్‌లో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి నీటి విడుదల డిసెంబర్ 15 వరకు మాత్రమే అంటున్నారని, నీటి విడుదలపై నవంబర్ 7న జరిగే సమావేశంలో పూర్తిస్థాయిలో నీటి విడులపై స్పష్టత వస్తుందన్నారు. నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లో పాక్షికంగా రైతులు నష్టపోయారన్నారు. గోనెగండ్ల మండలంలో నష్టపోయిన 40మంది రైతులకు రానున్న రబీలో పంట సాగుచేసుకునేందుకు ఒక కిట్టు మినుములు అందజేస్తామన్నారు. ఎమ్మిగనూరుకి తాగునీటి అందించే గుడికల్ చెరువులో నీటి నిలువ పెంచేందుకు సర్వే చేయించామన్నా రు. ఎమ్మిగనూరు, కోసిగి రోడ్డుకు నిధులు మం జూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఎల్లెల్సీ డీఈ విద్యాసాగర్, ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, ఏవో శివశంకర్, టీడీపీ ఎమ్మిగనూరు, నందవరం మండలాల నాయకులు కాశీంవలి, రైస్‌మిల్లు నారాయణ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నరసింహులు, మాచాని మహేష్, తిమ్మాపురం రంగన్న, ఉరుకుంద పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌కు పునరుజ్జీవనం

కర్నూలు పశ్చిమ ప్రాంత రైతాంగాన్ని ఆదుకునేలా సీఎం చంద్రబాబు నాయుడు వేగంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన ఆర్డీఎస్ ప్రస్తావన తీసుకొచ్చారు. కరువు ప్రాంత రైతులను ఆదుకునేందుకు ఆర్డీఎస్‌కు పునరుజ్జీవనం ఇస్తున్నారన్నారు. ప్రజల జీవనాడి అయిన ఆర్డీఎస్ ఏర్పాటుకు కేబినేట్‌లో ఆమోదం తెలిపారన్నారు. అందులో భాగంగానే భూ సేకరణ కోసం రూ.150 కోట్లు కేటాయించారని తెలిపారు. గత ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. కానీ తమ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. త్వరలో గురు రాఘవేంద్ర ప్రాజెక్టు(జీఆర్పీ) మరమ్మతులు పూర్తి చేసి ఆయకట్టు రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

మహిమాన్వితం కార్తీకమాసం

- శివకేశవులను ధ్యానించే మాసం
- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన ఆలయాలు



కర్నూలు కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శివకేశవులకు అత్యంత ఇష్టమైనది కార్తీక మాసం. ప్రతి ఏటా దీపావళి పండుగ వెళ్లిన మరుసటి రోజు నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుంది. నోములు, వ్రతాలకు ఈ మాసం ఎంతో ప్రాధాన్యం. బుధవారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. తెలుగు సంవత్సరంలో వ చ్చే ఎనిమిదో మాసమే కార్తీకం. చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలుస్తాడు కాబట్టే ఈ మాసాన్ని కార్తీకం అని అంటారు. శివకేశవులను భక్తిశ్రద్ధలతో కొలిచే ఈ మా సంలో చేసే పూజలు, నోములూ వ్రతాల వల్ల ఎన్నో శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే హైందవులు ఈ నెల మొత్తం నోములు, వ్రతాలు, జపం, ధ్యానం, పూజ, దీపారాధనతో భక్తిని చాటుకుంటారు. నెల రోజుల పాటు చేయలేని వారు కార్తీకంలో వచ్చే ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి, సోమవారాల్లో ఉపవాస దీక్షను నియమనిష్టలతో ఆచరిస్తుంటారు. ఆ రోజుల్లో ఉపవాసం ఉండి చీకటి పడిన తర్వాత నక్షత్ర దర్శనం చేసుకుని ఉపవాసాన్ని విడుస్తారు. కార్తీక మాసంలో దీపారాధనకు మహిళలు అధిక ప్రాధాన్యమిస్తారు. పూజలు చేసిన మహిళలు ఉపవాసాలతో శివకేశవులను ధ్యానిస్తారు.

పల్లె వైద్యం పడకేసింది

- 18వ రోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల సమ్మె
- వైద్యం అందక గ్రామీణుల అవస్థలు
- ఆర్ఎంపీ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు
- ఉమ్మడి జిల్లాలో 216 మంది వైద్యుల సమ్మె



రోగులు లేని ఆస్పరి పీహెచ్‌సీ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యం పడకేసింది. ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన సమ్మె బుధవారానికి 18వ రోజుకు చేరింది. గత నెల 26వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలోని (కర్నూలు 32, నంద్యాల 52) 87 పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. రోగులను చూసే దిక్కు లేకుండా పోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పీహెచ్‌సీలకు వస్తే అక్కడ రోగులను చూసే దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు జీజీహెచ్, సీహెచ్‌సీ, ఆయుష్, డెంటల్, పీజీ వైద్య విద్యార్థులను ప్రతి పీహెచ్‌సీకి నియమించారు. ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. చాలాచోట్ల నర్సింగ్ సిబ్బంది అందిస్తున్న వైద్యంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. కర్నూలు జిల్లాలో 35 పీహెచ్‌సీలో 96 మంది, నంద్యాల జిల్లాలో 52 పీహెచ్‌సీలో 120 మంది వైద్యులు సమ్మెలో ఉండటంతో వైద్యులు కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

జేబులు ఖాళీ చేసుకుంటూ..

వైద్యులు లేరని తెలుసుకున్న ప్రజలు వైద్యం కోసం పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ జేబులను ఖాళీ చేసుకుంటున్నారు. ప్రతినెల 2000 నుంచి 2500 వరకు ఉంటే ఓపీ రోగులు 1500కు చేరాయి. ప్రతి రోజు ఓపీ రోగులు 200 నుంచి 250 మంది ఉండేవారు. సమ్మె కారణంగా ఈ సంఖ్య 100కు దిగజారింది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా చాలా పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పీహెచ్‌సీలకు వచ్చిన రోగులు తమకు ఇది వరకు చికిత్స ఇచ్చిన వైద్యులు లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు.

మిగతా 7వ పేజీలో

అవిశ్వాసం వీగేనా..?

- రసవత్తరంగా ఆదోని మండల రాజకీయం ● ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న పార్టీలు ● మౌనం దాల్చిన ఎమ్మెల్యే పార్థసారథి
- రంగంలోకి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు
- నేడు అవిశ్వాస తీర్మాన సమావేశం

7

రిజిస్ట్రార్ల నియామకంలో ఇష్టారాజ్యం

అవిశ్వాసం వీగేనా..?



అవిశ్వాస తీర్మాన సమావేశ భవనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

- రసవత్తరంగా ఆదోని మండల రాజకీయం
- ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న పార్టీలు
- మౌనం దాల్చిన ఎమ్మెల్యే పార్థసారథి
- రంగంలోకి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు
- నేడు అవిశ్వాస తీర్మాన సమావేశం

ఆదోని మండల రాజకీయం రసవత్తరంగా మారింది. ఎంపీపీని పదవి నుంచి తొలగించేందుకు వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఎంపీపీ దానమ్మ వైసీపీ నుంచి గెలిచి బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి దానమ్మను పదవి నుంచి తొలగించేందుకు వైసీపీ ఎంపీటీసీలతో అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. దీనికి బుధవారం ముహూర్తం ఖరారైంది. అవిశ్వాస తీర్మానం వీగిపోయేందుకు సహకరించాలని ఎంపీపీ, ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పార్థసారథిని కలిశారు. ఆయన చేతులెత్తేశారు. ఈ విషయం టీడీపీ నాయకులకు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు రంగంలోకి దిగారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా ఎంపీపీ అవిశ్వాస తీర్మానంతో మండలంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

ఆదోని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అవిశ్వాస తీర్మానంలో నెగ్గాలని ఎంపీపీ దానమ్మ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఆదోని మండల రాజకీయం రసవత్తరంగా మారింది. ఎంపీపీ అవిశ్వాస తీర్మాన సమావేశ రూపంలో రాజకీయం వేడెక్కింది. ఎంపీపీ దానమ్మపై వైసీపీ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని కోరడంతో బుధవారం అధికారులు సమావేశాన్ని నిర్వహించనున్నారు. దానమ్మ వైసీపీ తరఫున గెలిచి ఎంపీపీ పదవిని అలంకరించారు. కూటమి ఏర్పడ్డాక ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో ఆమె భర్త బడాయి పంపాపతితో కలిసి బీజేపీ కండువా కప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఎలాగైనా ఆమెను ఎంపీపీ పదవి నుంచి తొలగించాలని వైసీపీ ఎంపీటీసీలతో అవిశ్వాసాన్ని పెట్టించారు. దానమ్మపై అవిశ్వాసం పెట్టించిన రోజు 19మంది ఎంపీటీసీలు వైసీపీకి ఉండేవారు. నేడు ఆ సంఖ్య తగ్గుముఖం పట్టింది.

ఎమ్మెల్యేను కలిసినా..

ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై ఎమ్మెల్యే పార్థసారథి మౌనంగా ఉన్నారు. ఆదోనిలో లేకపోవడంతో ఎంపీపీ దానమ్మ, ఆమె భర్త పంపాపతి, తనయుడు మధుతో పాటు అనుచరులు విజయవాడలో ఉంటున్న ఎమ్మెల్యేను కలిశారు. తమకు సహకరించాలని, ఎలాగైనా ఎంపీపీ పదవి పోకుండా చూడాలని ప్రాధేయపడ్డారు. తమకు అండగా ఉండాలని, అవిశ్వాస తీర్మానంలో నెగ్గకపోతే రాజకీయ భవిష్యత్తు ఉండదని ఎమ్మెల్యేను కోరారు. తానేమీ చేయలేనని.. కావాలంటే అధి కారులకు చెబుతా అని ఎమ్మెల్యే అన్నట్లు సమాచారం. దీంతో ఎంపీపీ కుటుంబం ఆదోనికి తిరుగు ముఖం పట్టారు.

నెగ్గాలంటే..

ఎంపీపీ దానమ్మపై పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి కచ్చితంగా 17మంది ఎంపీటీసీలు హాజరు కావాల్సిందే. 23మంది ఎంపీటీసీలకుగాను 2/3 చొప్పున 17మంది (కోరం) సమా వేశంలో ఉండాల్సిందే. ఒకవేళ గతంలో హైకోర్టు తీర్పు ప్రకారం ఖాళీలను పరిగణనలోకి తీసుకోకపోతే 23మంది ఎంపీటీసీలకు గానూ 2/3 చొప్పున 15 మంది హాజరుకావాల్సి ఉంటుంది. ప్రస్తుతం వైసీపీ చెరలో 16మంది, కూటమి చెరలో 7మంది ఎంపీటీసీలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వైసీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కచ్చితంగా వారికి 17మంది ఎంపీటీసీలు ఉండాల్సిందే. ఎంపీపీ దానమ్మతోపాటు వారి చెరలో ఉన్న ఆరుమంది ఎంపీటీసీలు ఈ సమావేశానికి గైర్హాజరయ్యే అవకాశం ఉంది.

ఒక్కసారే అవకాశం

అవిశ్వాస తీర్మానం పెట్టిన సమావేశానికి కోరం లేకపోయినా, కోర్టు వాయిదా వేసినా, మరే ఇతర కారణాలతోనైనా సమావేశం రద్దు అయితే మరోసారి అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సభ్యులకు అవకాశం ఉండదు. ఒకవేళ ఈ సమావేశం కోరం లేక రద్దు అయితే దానమ్మ ఎంపీపీగా కొనసాగుతారు. ఒకవేళ సమావేశం జరిగి వైసీపీ సభ్యులు అవిశ్వాస తీర్మానంలో నెగ్గితే దానమ్మ దిగిపోక తప్పదు. ఆమె స్థానంలో వైస్‌ఎంపీపీ నరేంద్రరెడ్డి తాత్కాలిక ఎంపీపీగా కొనసాగే అవకాశం ఉంది.



సమావేశానికి సిద్ధం అవుతున్న మండల అధికారులు

డివైడర్ ఎక్కిన బస్సు



కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై నన్నూరు బస్ స్టేజీ వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు డివైడర్ ఎక్కింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు వెళ్తుండగా.. నన్నూరు బస్ స్టేజీ వద్ద వెనుక వైపు నుంచి కారు క్రాస్ చేశాడు. వాటిని తప్పించబోయి డ్రైవర్ బస్సును డివైడర్ పైకి ఎక్కించాడు. అయినా ఎలాంటి ప్రమాదం జరగలేదు.

● ఓర్వకల్లు, ఆంధ్రజ్యోతి

రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతి

మంత్రాలయం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి తమిళనాడుకు చెందిన పాల్‌రాజ్(33) అనే వ్యక్తి కిందపడి మృతి చెందాడు. ఈ ప్రమాదం మంగళవారం ఉదయం జరిగింది. ఆదోని రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడులోని మధురైకు చెందిన పాల్‌రాజ్ రెండు నెలలు క్రితం షోలాపూర్‌లో కూలీ పనులకు వెళ్లాడు. పనులు ముగించుకుని సొంత పట్టణానికి నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో వెళ్తుండగా రైల్లో రద్దీగా ఉండటంతో డోర్ దగ్గర నిల్చొని ఉండి, అదుపుతప్పి తుంగభద్ర పాతరైల్వే స్టేషన్ (మంత్రాలయం రోడ్) దగ్గర రైల్వేట్రాక్‌పై పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు కాళ్లు విరిగి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక అతను మృతిచెందాడు. మృతుడి దగ్గర లభించిన ఆధారాలు సహాయంతో బంధువులకు సమాచారం ఇచ్చారు. ఆదోని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య కామాక్షి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి బాబురావు బహిష్కరణ

కర్నూలు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ డీసీసీ బాబురావును రెండేళ్ల పాటు పార్టీ బహిష్కరించిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదలైంది. క్రమశిక్షణా సంఘం చైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపింది. ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ నాయకుల సమక్షంలో కార్యకర్తలపై అనుచితంగా ప్రవర్తించడం, అసభ్య పద జాలాన్ని ఉపయోగించి వారిపై భౌతికదాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందిందని, ఈ ఫిర్యాదుపై లిఖిత పూర్వకంగా సంజాయిషీ కోరగా, వాట్సప్ మెసేజ్ సంతృప్తి కరంగా లేనందున పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని అందులో పేర్కొన్నారు.

పెన్షన్ రివిజన్ చేపట్టాలి

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ వెంటనే చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. యాకోబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కేకే భవన్‌లో అసోసియేషన్ 17వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో పీఆర్‌సీ 2017 సంవత్సరం జనవరి నుంచి అమలు చేయాలన్నారు. 72.8 శాతం ఐడీఏ మర్జర్‌తో పెన్షన్ రివిజన్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 8 సంవత్సరాల నుంచి రెండో పీఆర్‌సీ అమలు కోసం అనేక పోరాటాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. మహేశ్వరరావు, సహాయ కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏ. రామలింగం, కార్యదర్శి ఎల్. విజయభాస్కర్, వైస్ ప్రెసిడెంట్ మద్దిలేటి, కోశాధికారి ఖాజామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

● కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి దూసుకుపోతున్నదని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్, మంత్రి నారా లోకేశ్ ప్రపంచ దేశాలు తిరిగి భారీ ఎత్తున పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడులు రాబట్టారని తెలిపారు. పరిశ్రమలు రాకుండా అడ్డుకున్న జగన్‌కు గత ఎన్నికల్లో ప్రజలు ఓడించారని అన్నారు. ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు. టీజీ భరత్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ.2.5 కోట్ల మేర ఆస్తి నష్టం



అగ్నిప్రమాదం జరిగిన దృశ్యం

కర్నూలు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతబస్తి రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ తిరుమల్ సిల్క్స్ వస్త్ర దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో దుకాణంలో ఉన్న వస్తువులు, చీరలు, ఇతర దుస్తులు కాలిపోయాయి. నిర్వాహకులు, సిబ్బంది, కస్టమర్లు దుకాణంలో ఉండగానే ఈ ప్రమాదం జరిగింది. మొదట లైట్లు బ్లింక్ బ్లింక్ అనడంతో ప్రమాదం గుర్తించిన సిబ్బంది వెంటనే లైట్లను, ప్రధాన స్విచ్‌బోర్డులను ఆఫ్ చేశారు. అయినప్పటికీ మంటలు వ్యాపించాయి. కస్టమర్లను, సిబ్బందిని బయటకు పంపి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శకటాలు దగ్గరలోనే ఉండటంతో ఆ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని మంటలను ఆర్పేయడంతో చుట్టుపక్కల దుకాణాల్లో నష్టం వాటిల్లలేదు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.2.5 కోట్ల ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని దుకాణ నిర్వాహకుడు వరప్రసాద్ తెలిపారు.

పల్లె వైద్యం పడకేసింది

5వ పేజీ తరువాయి

అక్కడ పని చేస్తున్న నర్సులు, సిబ్బంది సైతం డాక్టర్లు లేరని తాము ఏమి చేయలేమని చేతులెత్తేశారు. కొన్ని పీహెచ్‌సీల్లో నియమించిన వైద్యులు మధ్యాహ్నం 12 గంటలకే ఇంటి ముఖం పట్టడంతో రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

ఆదోనికి రెఫర్..



కోసిగి పీహెచ్‌సీలో చికిత్స కోసం వచ్చిన రోగులు

మాధవరం గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి సునీత దంపతులు ఉరుకుందకు వెళ్తుండ గా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆ దంపతుల ఏడు నెలల చిన్నారి లాస్య తలకు తీవ్ర గాయమైంది. రక్తమడుగులో కోసిగి పీహెచ్‌సీకి తీసుకు వచ్చారు. వైద్యులు సమ్మెలో ఉండటంతో స్టాఫ్ నర్సు, ఎంఎల్‌పీహెచ్‌పీ ప్రథమ చికిత్స అందించారు. ఆదోని ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు.

పీహెచ్‌సీలో తగ్గిన ఓపీ



తుగ్గలి పీహెచ్‌సీ

పత్తికొండ నియోజకవర్గంలో తుగ్గలి పీహెచ్‌సీకి ప్రతిరోజు 50 నుంచి 60 మంది ఓపీకి రోగులు వచ్చేవారు. ప్రస్తుతం పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉండటంతో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు ఓ ఆయుష్ వైద్యుడిని పీహెచ్‌సీకి కేటాయించారు. ఆయుష్ డాక్టర్ ఉండంటతో మంగళవారం ఓపీకి 30 మంది రోగులు వచ్చారు. కొందరు ప్రైవేటు డాక్టర్లను, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

నేటి నుంచి 'కార్తీక' వేడుకలు

యాగంటి క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి



బనగానపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం యాగంటిలో బుధవారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు పారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డిలు మంగళవారం తెలిపారు. ప్రతి రోజు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి, పల్లకి సేవోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న కార్తీక మాస మొదటి సోమవారం, నవంబరు 3వతేదీ కార్తీక మాస రెండవ సోమవారం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నవంబరు 5న బుధవారం కార్తీక పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆ రోజున జరిగే వేడుకల్లో ముఖ్య అతిథులుగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ, ఎంపీ బైరెడ్డి శబరి, అరుణభారతి వ్యవస్థాపకుడు బీసీ రాజారెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా యాగంటి క్షేత్రంలో ప్రముఖ కళాకారులచే పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 10వతేదీన మూడవ సోమవారం, నవంబరు 17న నాలుగో సోమవారం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఉమామహేశ్వర నిత్యాన్నదానసంస్థ, ఉమామహేశ్వర రెడ్డి అన్నదాన సంస్థ, ఉమామహేశ్వర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థ తదితర సంస్థలు భక్తులకు భోజన సౌకర్యానికి ముందుకొచ్చాయన్నారు. భక్తులకు మంచి నీటి వసతికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడండి : బీసీ

● యాగంటిలో కార్తీక మహోత్సవాలపై సమీక్ష



బనగాన పల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని యాగంటిలో జరిగే మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఏర్పాట్లపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో యాగంటికి జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారన్నారు. పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటుచేయాలని సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డిని సూచించారు. తాగునీటి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్తీక పౌర్ణమి పుణ్యదినాల్లో యాగంటి ఆలయానికి భక్తుల ఒత్తిడి పెరిగే వీలున్నందున ఆసయంలో టోల్‌గేటు ఫీజులను రద్దుచేయాలని ఆలయ అసిస్టెంటు కమిషనర్ పాండురంగారెడ్డిని ఆదేశించారు. అదనపు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేయాలని, విద్యుత్, క్యూలైన్లు తదితర వాటిపై సూచనలు, సలహాలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో హెల్త్ క్యాంపుతో పాటు ఎమర్జెన్సీ అంబులెన్సు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆంగ్ల భాషా నైపుణ్యం తప్పనిసరి

● కలెక్టర్ సిరి



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య స్థాయిలోనే ఆంగ్లభాష బోధనపై దృష్టి సారించాలని, అందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కలెక్టర్ డాక్టర్ సిరి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ విద్యాశాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ సిరి పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య స్థాయిలోనే ఆంగ్లభాష నైపుణ్యాలను విద్యార్థులకు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 20 మంది రిసోర్స్ పర్సన్లను నియమించాలన్నారు. 20 మందికి రాష్ట్ర స్థాయి రిసోర్స్‌పర్సన్ల చేత శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. దీనికి వెంటనే ప్రణాళిక రూపొందించి అమలులోకి తీసుకురావాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి ఎంపీపీలు, సర్పంచులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్‌డీ అండ్ పీఆర్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయా మండల కేంద్రాల్లోని ఎంపీపీ హాలులో బుధవారం నుంచి 25 వరకు ఎంపీపీలు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్ జి. నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా డివిజన్ స్థాయిలో నాలుగు రోజులు జరిగే శిక్షణలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శ్రీకాళహస్తిలో శిక్షణ పొందిన డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ ఇస్తారని వివరించారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మంత్రాలయం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో సూగూరు గ్రామానికి చెందిన చాకలి వెంకటేష్ (50)అనే వ్యక్తి అతిగా మద్యం తాగి మృతిచెందినట్లు మాధవరం హెడ్‌కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మద్యానికి బానిసై మంగళవారం సూగూరు గ్రామం నుంచి మాధవరంకు వెళ్లి సరుకులు తెస్తానని చెప్పి ఇంటి నుంచి వచ్చాడు. మాధవరంలో మద్యం తాగి తూగుతూ తుంగభద్ర రోడ్డు నుంచి సర్కిల్ వైపు వస్తూ బోర్లా పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య చాకలిపద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రార్ల నియామకంలో ఇష్టారాజ్యం

12 నాటి స్నాతకోత్సవం కోసం తంటాలు.. ● జీవోలను ధిక్కరిస్తున్న వర్సిటీలు ● నేడు యాప్సికి ఆర్‌యూ ఉన్నతాధికారులు



రాయలసీమ యూనివర్సిటీ ముఖద్వారం

కర్నూలు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రార్ల నియామకాల్లో విద్యామండలి జారీ చేసిన 298852/యూఈ, ఏ-1. 2023 జీవోలను ఆర్‌యూ ధిక్కరిస్తోంది. ఆర్‌యూలో పని చేస్తున్న రిజిస్ట్రార్‌కు ఈనెల 17న డిప్యుటేషన్ కాలం పూర్తయినప్పటికీ ఆయన్నే కొనసాగించాలని ఉపకులపతి నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. గతంలో కడప జిల్లా యోగి వేమన వర్సిటీ నుంచి రాయలసీమ విశ్వవిద్యాలయానికి, క్లస్టర్ యూనివర్సిటీకి డిప్యుటేషన్ మీద పంపిన రిజిస్ట్రార్ల పదవీ కాలం ముగిశాక వాళ్లను తిరిగి పంపించారు. సెప్టెంబరులో క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా కట్టా వెంకటేశ్వర్లుకు డిప్యుటేషన్ కాలం పూర్తయిందని వెనక్కి పంపారు. రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్‌గా పని చేసిన అంకన్నను ఏడాది లోపే మాతృ సంస్థకు పంపారు. కానీ ఇప్పుడు నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్‌యూ రిజిస్ట్రార్‌ను పదవీ కాలం పూర్తయినా ఇంకా కొనసాగించడం వివాదాస్పదమైంది. యూనివర్సిటీలో ఉన్న ప్రొఫెసర్లకు అవకాశం ఇవ్వకుండా డిప్యుటేషన్ మీద వచ్చిన వ్యక్తిని నిబంధనలకు వ్యతిరేకంగా ఇంకా కొనసాగించడం ఏమిటనే విమర్శలు వినిపిస్తున్నాయి. విశ్వవిద్యాలయ అధికారుల వ్యవహారంపై ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. రాయలసీమ వర్సిటీలో నవంబరు 12న కాన్వకేషన్ ప్రక్రియను అడ్డుపెట్టుకుని రిజిస్ట్రార్‌ను ఇక్కడే కొనసాగించేందుకు ఆమోదం కోసం కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌ను బుధవారం కలిసేందుకు స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో వెళుతున్నారని కొందరు ప్రొఫెసర్లు ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో 2, 4, 6, 8వ సెమిస్టర్ రెగ్యులర్/ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుంచి నవంబర్ 1 వరకు జరుగుతాయని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉస్మానియా కళాశాలలో జరిగే పరీక్షకు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు అరగంట ముందు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 861 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

వైభవంగా దీపావళి..


వేడుకలు చేసుకుంటున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, కుటుంబ సభ్యులు


కోడుమూరులో చిన్నారులు..


ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి


మాజీ ఎమ్మెల్యే కాటసాని కుటుంబ సభ్యులు

కర్నూలు, కోడుమూరు పాణ్యం పరిధిలో సోమవారం దీపావళి వైభవంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కర్నూలులో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి వేడుకలు చేసుకున్నారు.
- కర్నూలు కల్చరల్/అర్బన్,కల్లూరు, కోడుమూరు రూరల్, గూడూరు, సి.బెళగల్

'డీఏ జీవోలను సవరించాలి'

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డీఏ జీవోలను సవరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్‌వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధనుంజయ, వర్కింగ్ ప్రెసిడెంటు రవిప్రకాష్ మంగళవారం ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మంత్రులు, ఉపాధ్యాయులతో చర్చించడం ఆహ్వానించదగినదన్నారు. అయితే పీఆర్‌సీ నష్టపోయామని ఐఆర్ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. డీఏ జీవో.నెం.60ని వెంటనే సవరించాలని ఆప్టా జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ప్రకటనలో కోరారు. పదవీ విరమణ పొందినవారికి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


దుకాణాలను తొలగిస్తున్న పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్టీబీసీ కళాశాల, అవుట్ డోర్ స్టేడియం వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలను నగర పాలక పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తొలగించారు. ఈ ప్రాంతంలో ఈట్‌స్ట్రీట్ ఏర్పాటుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. కమిషనర్ పి.విశ్వనాథ్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్‌ల రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు ఎం.కుబేర నాయుడు అన్నారు. ఎ.క్యాంపు మాంటెస్సోరి పాఠశాలలో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల ఎంపిక పోటీలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడల్లో పాల్గొలాని, పతకాలు సాధించాలన్నారు. సంఘం కార్యదర్శి కే.విజయ్ కుమార్ మాట్లాడుతూ నవంబరు 8 నుంచి 9 వరకు గుంటూరు జిల్లాలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పీఈటీలు రంగముని, ఈశ్వర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

కల్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారానికి సబ్‌స్టేషన్లవారీగా ఫిర్యాదు చేయాలని ఏడీఈ-1 నాగప్రసాద్ ప్రకటనలో తెలిపారు. పవర్‌హౌస్-08518 221919, సెల్-94408 13358, సెంట్రల్‌సెక్షన్-08518 21918, 94408 13361, బళ్లారి రోడ్డు సెక్షన్-91547 91252, 94408 13362, సంతోష్‌నగర్ సెక్షన్- 08518 250577, 94910 67586, ఏడీఈ 94408 13332 నెంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపాలని నాగప్రసాద్ సూచించారు.

ప్రొటోకాల్‌ను అమలు చేయాలి


జేసీతో డైరెక్టర్ మంజునాథ్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు మంజునాథ్, మురళి నాయుడు కోరారు. మంగళవారం జేసీ నూరుల్ కమర్‌ను కలిసి సన్మానించారు. నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్ ఉన్నారు.

షూటింగ్ చాంపియన్‌షిప్‌కు శ్రీకర్



కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు కర్నూలు షూటర్ శ్రీకర్ అర్హత సాధించారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో నిర్వహించిన 16వ సౌత్ జోన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో శ్రీకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 400 పాయింట్లకు 350 పాయింట్లు సాధించారు. ఆర్కే రైఫిల్ అకాడమీ కోచ్ రవికుమార్, జిల్లా రైఫిల్ షూటింగ్ సంఘం కార్యదర్శి ఎంఎండీ బాషా అభినందించారు.

'కర్నూలు ఉత్సవ్'కు కవితల ఆహ్వానం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1 నుంచి 7 వరకు వారం పాటు నిర్వహించే 'కర్నూలు ఉత్సవ్'కు ఉమ్మడి జిల్లాల కవుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో కోరారు. టీజీవీ కళాక్షేత్రం, ఏపీ నాటక అకాడమీ, బాష సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. కవితలు రెండు పేజీలకు మించకుండా ఉండాలని, అనువాదం, అనుకరణ ఉండరాదన్నారు. పేరు, చిరునామా, సెల్ నెంబరు తెలియజేస్తూ ఈనెల 28లోగా అధ్యక్షుడు, టీజీవీ కళాక్షేత్రం, సి.క్యాంపు సెంటర్, కర్నూలు చిరునామాకు పంపాలన్నారు.

'నిఖా' లఘుచిత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన నిర్మాత బొరెల్లి వెంకటరాముడు నిర్మిస్తున్న లఘుచిత్రం 'నిఖా' పోస్టర్‌ను రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, మంత్రి టీజీ వెంకటేశ్ మంగళవారం ఆవిష్కరించారు. యువతకు తమ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రభుత్వం తరపున సాయం చేస్తానని మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, బొరెల్లి వెంకటరాముడు, దర్శకుడు రవీంద్ర, మేనేజర్ చిన్న నరసింహులు, కథానాయకుడు ప్రదీప్, బండి నాగరాజు, నటులు ఆర్ట్ శ్రీను, కేఆర్‌పీ హనీ, రాజు, కర్నూలు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నందనపల్లెకు చెందిన కాశపోగు మధుకుమార్‌కు మంగళవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రూ.60వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. బాధితుడు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో ఎమ్మెల్యేను కలవగా, అధికారులతో మాట్లాడి రూ.60వేలు మంజూరు చేయించారు.

అధిక ధరలకు విక్రయిస్తే దుకాణం సీజ్


స్టాక్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు.

సి. బెళగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని విజిలెన్స్ సీఐ పార్థసారధి హెచ్చరించారు. మంగళవారం సి.బెళగల్, పోలకల్లు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మాలన్నారు. యూరియా, ఫర్టిలైజర్ ఎరువుల ధర, స్టాక్ వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. ఏవో మల్లేష్‌కుమార్, ఎంపీఈవో వెంకటేశ్వర్లు ఉన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలనుంచి భారతదేశ వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని పలుచోట్లు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సుంకాలను అమలు చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జి.రామక్రిష్ణ, హనుమంతు, వీరశేఖర్, కె.వెంకటేషులు పాల్గొన్నారు.

జీవో143ను రద్దు చేయాలి


కడప ఆర్డీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవో.నెంబర్.143ని రద్దు చేయాలని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వైద్యఆరోగ్యశాఖ కడప ఆర్డీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఏ.మాధవరాజు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మద్దయ్య, కోర్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ సాహెబ్, రోజ్ ప్రసన్న పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవోతో 3వేల సూపర్‌వైజర్ క్యాడర్ల పోస్టులు రద్దు అయి ఉద్యోగులు పదోన్నతులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో ఆఫీసులో పనిచేసి బదిలీ అయిన సీనియర్ అసిస్టెంటుట్లు మధుసూదన్, సంపత్ కుమార్‌ను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఆర్‌డీ డా.రామగిడ్డయ్య మాట్లాడుతూ బదిలీ అయిన ఉద్యోగులు వెంటనే వెళ్లిపోవాలని, దీనిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నవంబరు 9న వనభోజనం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నవంబరు 9న కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో కరపత్రాలు విడుదల చేశారు.

వచ్చే నెల 7న రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు


కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న ప్రతినిధులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నవంబర్ 7న రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు ఏపీఆర్‌ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. మంగళవారం కలెక్టర్ సిరిని ఆహ్వానించారు. అనంతరం జేసీ నూరుల్ కమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మను ఆహ్వానించారు. లక్ష్మిరాజు, లోకేశ్వరి, కృష్ణవేణి, లోకేష్, భాను ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగ కార్యవర్గం

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా గ్రేసీ స్టెబిస్టిన్, అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాషా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, లక్ష్మి నారాయణ, దుర్గారావు, వన్నూరు బాషా పాల్గొన్నారు.

రెండు బస్సులు ఢీ...

కర్నూలు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణానగర్ ఫ్లై ఓవర్ వద్ద రెండు విద్యాసంస్థల బస్సులు ఢీకొన్నాయి. వివరాల మేరకు.. రిడ్జ్ పాఠశాల బస్సు కృష్ణానగర్ ఫ్లైఓవర్ వద్ద వంతెన పైకి వెళుతూ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. వెనుకనే వస్తున్న కేవీ సుబ్బారెడ్డి కళాశాల బస్సు రిడ్జ్ బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో కేవీ సుబ్బారెడ్డి కళాశాల విద్యార్థినికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని గుత్తి పెట్రోల్ బంక్ హ్యాంగౌట్ హోటల్ వెనుక గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుంది. గ్రీన్ కలర్ చొక్కా, ముదురు ఎరుపు రంగు షార్ట్ ధరించాడు. కుడి చేతి మణికట్టుపైన సులోచన అని పచ్చబొట్టు ఉంది. ఆచూకీ తెలిసిన వారు రైల్వే సీఐ శ్రీనాథ్ రెడ్డి 9908889696కి ఫోన్ చేయాలని కానిస్టేబుల్ నూర్‌బాషా తెలిపారు.

ఉరివేసుకుని యువకుడు..

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన ప్రభాకర్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. ఈయన సోదరుడు కెనడాలో ఉండగా.. తల్లి ఇటీవలే చిన్నకొడుకు వద్దకు వెళ్లింది. ప్రభాకర్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇటీవలే మానేశాడు. సోమవార సాయంత్రం స్నేహితులు ఇంటికి వెళ్లగా ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురీకి తరలించారు. మృతుడి మామ అశోక్ కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా దుకాణాలపై దాడులు

కర్నూలు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా దుకాణాలపై ఎస్ఐ గోపినాథ్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. బాణసంచాను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండిళ్లల్లో చోరీ

కర్నూలు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో పుల్లారెడ్డి డెంటల్ కళాశాల సమీపంలోని రిషికాంత్ విల్లాస్‌లోని సోమవారం తెల్లవారుజామున రెండు ఇళ్లలో చోరీ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటిలోఇన పై అంతస్తులో నిద్రిస్తుండగా.. దుండగులు తలుపులు తెరిచ రూ.10వేల నగదును చోరీ చేశారు. సమీపంలో ఉన్న కోనారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో బైక్ చోరీ చేశారు. బాధితులు పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈశ్వరయ్య ఎంపికపై హర్షం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్య ఎన్నిక పట్ల ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాసులు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యదర్శిగా పని చేసి నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం గళం విప్పిన ప్రభుత్వాలపై ఉద్యమం కొనసాగించడానికి ఎంతో కృషి చేసారని కొనియాడారు. ప్రజల పక్షాన మరిన్ని ఉద్యమాలు నిర్మించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు.

రైతు సేవా కేంద్రాన్ని కొనసాగించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మణేకుర్తి గ్రామస్థులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేముగోడు గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని కొనసాగించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.కోటకొండ సూరి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. వేముగోడు గ్రామం నుంచి పుట్టపాశం గ్రామానికి తరలించడం అన్యాయమన్నారు. కలెక్టర్ స్పందించి కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యక్షుడు పి.హనుమంతు, ఈ.తాంధ్రపాడు సర్పంచ్ బాలపీరా, జి.ఆంజనేయులు, మహబూబ్‌బాషా గ్రామ రైతులు పాల్గొన్నారు.

● ఆలూరు మండలం మణేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ ఏర్పాటుకు సాగు భూములను లాకోవద్దని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సాగు భూములను లాక్కునేందుకు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ 74 మంది రైతుల నుంచి 192 ఎకరాల భూసేకరణ చేస్తున్నట్లు ప్రాథమిక ప్రకటన ఇచ్చారన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సూరి, హనుమంతు, ఆంజనేయులు, రాఘవేంద్ర, మనేకుర్తి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

డీఎం మొండి వైఖరి వీడాలి


నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

కర్నూలు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కర్నూలు-1 డిపో మేనేజర్ సంధ్యారాణి మొండి వైఖరి విడనాడాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ కమిటీ సభ్యుడు ఎస్‌కెఎం బాషా, జమ్మన్న డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమ, మంగళవారాల్లో ఎర్రబ్యాడ్జీలు ధరించి కార్మికులు విధులకు హాజరయ్యారు. అనంతరం డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. పలుమార్లు విన్నవించినా డీఎం జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. నరసింహులు, జి.శ్రీనివాసులు, సయ్యద్ ఇసాక్, సుబ్బన్న, భాస్కర్ ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్ల అంగీకారం


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ ఎస్.క్రిష్ణయ్య

కల్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించడం పట్ల జేఏసీ చైర్మన్ ఎస్.క్రిష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విద్యుత్ భవన్‌లో కర్నూలు జేఏసీ అధ్యక్షుడు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న 29 డిమాండ్లను ఒప్పుకుని కొన్నింటికి యాజమాన్యం తక్షణమే ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. శివకుమార్, సుభాకర్, లక్ష్మికాంతరెడ్డి, నాగశేషులు, రమణమూర్తి పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించండి

● జిల్లాలో వలసల నివారణకు వెంటనే చర్యలు : కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించాలని, పంట నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల సమావేశం నిర్వహించారు. ఉల్లి, టమోటా, పత్తి, మిరప, శనగ పంట సాగు వివరాలు, నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు పంట మిశ్రమ పంటలు సాగు చేసుకునేలా, పంట మార్పిడి పాటించేలా చూడాలన్నారు. ఏసీ నూరల్ కమర్, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏడీ రాజా కృష్ణారెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం రాజు, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, ఫిషరీష్ డీడీ రంగనాథరావు, అగ్రికల్చర్ ఏడీ రాజశేఖర్, నాబార్డుమేనేజర్ సుబ్బారెడ్డి, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

సోమిశెట్టి పూజలు


పూజలు చేస్తున్న సోమిశెట్టి దంపతులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని పుణ్యక్షేత్రమైన అహోబిలాన్ని మంగళవారం కుడా చెర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో సోమిశెట్టి దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామికి వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సోమిశెట్టి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు గూడురు సంజీవరాయుడు పాల్గొన్నారు.



నగరంలోని కలెక్టరేట్ వద్ద కలెక్టర్ బంగ్లాకు సమీపంలోని ఎ.క్యాంపు క్వాటర్స్‌లో పశువైద్యశాల భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. నిత్యం భయంతోనే విధులు నిర్వహించాల్సి వస్తోందని పశువైద్యులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. చిన్న వర్షం కుసినా గది మొత్తం తడిసిపోయి.. రికార్డులు, మందులు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయించి, ప్రహరీ నిర్మించాలని పశువుల యజమానులు కోరుతున్నారు. - **కర్నూలు అగ్రికల్చర్**



నగర పంచాయతీలో ఇరుకు రోడ్లతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు మేజర్ పంచాయతీని 2011లో నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. పట్టణంలో సుమారు 30వేలకు పైగా నివసిస్తున్నారు. నగరపంచాయితీగా మారి 14 ఏళ్లు గడిచినా పట్టణం రూపురేఖలు రోడ్లపై తోపుడు బండ్లు ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు రహదారులను విస్తరించాలని కోరుతున్నారు. - **గూడూరు**

క్రీడలతో మంచి భవిష్యత్తు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా అండర్- 14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రమేష్ బాబు, తాలూకా క్రికెటర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్, జేఎం భాష, కోచస్ ప్రసన్న, మహబూబ్ భాషా శేఖర్, బాలాజీ పాల్గొన్నారు.

రూ.లక్ష నోట్లతో అమ్మవారికి అలంకరణ


అలంకరణలో అమ్మవారు

మద్దికెర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామ దేవత మద్దమ్మవ్వకు గ్రామానికి చెందిన భక్తులు కోళ్లపారం లక్ష్మీనారాయణ, పార్వతి దంపతులు రూ.1లక్ష విలువ గల నోట్లతో అమ్మవారిని అలంకరించారు. మంగళవారం దీపావళి అమావాస్య పర్వదినంలో భాగంగా గ్రామదేవత మద్దమ్మవ్వకు రూ.50, 20, 500, 10 నోట్లతో అమ్మవారికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

వెల్దుర్తి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గుడేకల్లు పీఠాధిపతి గురుగాజీ హుసేన్ స్వామి, హమీద్ హుసేన్ స్వాములు అన్నారు. వెల్దుర్తి పట్టణ ప్రజలు గుడికల్ హుసేన్ పీర్ల స్వాముల వారి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గంధం వేడుకలను, మంగళవారం ఆరాధనోత్సవాలు నిర్వహించి సత్సంగ కార్యక్రమాలు నిర్వహించారు.. ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన అశేషంగా తరలివచ్చారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భక్తులకు కమిటి సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో భక్తాదులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ భర్త అదృశ్యం

ఆదోని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నా భర్త మూడు రోజులుగా కనిపించడం లేదని బైచిగేరి ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి భార్య విజయలక్ష్మీ తాలుక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం కూటమి నాయకులు తన భర్తను సాయిబాబా దేవాలయం సమీపంలో కారులో తీసుకెళ్లారని, నేడు ఎంపీపీ అవిశ్వాస తీర్మానం ఉన్నందున తన భర్తను కిడ్నాప్ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని, కూతురు అత్తతో కలిసి ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు.

పిడుగుపడి ఎద్దు మృతి

ఆస్పరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగరడోన గ్రామంలో పిడుగు పడి ఎద్దు మృతి చెందింది. మంగళవారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి నరేష్ అనే రైతు పొలంలో గుంటక పనులు ముగిసిన తర్వాత ఎద్దులను పక్కన చెట్టుకు కట్టేశాడు. ఉరుములు, మెరుపులతో వర్షం రావడంతో ఎద్దుపై పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.80 వేలు వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం బాధితా రైతును ఆదుకోవలాని ఎంపీటీసీ నరసప్ప, కృష్ణమూర్తి యాదవ్, మునిస్వామి, వీరేష్ కోరారు.

ఈశ్వరాలయంలో పూజలు

ఆదోని టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గంగభవాని దేవాలయంలో మంగళవారం గంగాధీశ్వర స్వామి శివలింగానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం శివలింగానికి క్షీరాభిషేకం, కుంకుమార్చన, తులసి అర్చన పూజలను అర్చకులు సత్యనారాయణ స్వామి, మధుసూధన్ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, మేఘనాథ్, వెంకటేశ్వర్లు, అంబన్న, కృష్ణ మూర్తి, బాలరాజు, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినే యులు పాల్గొన్నారు.

నేటి నుంచి హుల్తి లింగేశ్వరస్వామి ఉత్సవాలు

పత్తికొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భక్తులచే విశేష పూజలందుకుంటున్న హుల్తి లింగేశ్వరస్వామి ఉత్సవాలు మండలంలోని పెద్దహుల్తి గ్రామంలో నేటి నుంచి మూడురోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ప్రతి ఏటా దీపావళి అమావాస్య మరుసటి రోజైన పాడ్యమి రోజు బుధవారం (ఈనెల 22వ తేదీ) స్వామివారి ఆలయం వద్ద పందిరి వేసి మందపూజతో విశేష పూజలను అందుకుంటారు. 23న గురువారం గంగపూజ, అనంతరం హుల్తెప్ప, కారుమంచప్పల ఉత్సవ విగ్రహాలను ఉదయం నుంచి సాయంత్రం దాకా గ్రామంలో మేళతాళాలు, బీరప్పడోలు మధ్య ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధులగుండా ఊరేగిస్తారు. 24న శుక్రవారం, ఊరుబయట ఉన్న బీరప్పస్వామి దేవాలయం నుంచి యధాస్థానమైన ఊరిలో వెలిసిన దేవుని ఇంటికి స్వాములవారు చేరుకోవడంతో ఉత్సవాలు ముగుస్తాయి. కొలిచేవారికి కొంగు బంగారంగా భక్తులచే విశేష పూజలందుకుంటున్న హుల్తి లింగేశ్వర స్వామివారి ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. వచ్చిన భక్తాదులకు మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాలను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

'దేవాలయ అభివృద్ధికి సహకరిస్తా'


న్యాయాధికారి హేమకు స్వామివారి చిత్రపటాన్ని ఇస్తున్న విజయప్రసాద్ యాదవ్

మద్దికెర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దమ్మకుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తానని ఆలూరు న్యాయాధికారి హేమలత అన్నారు. మంగళవారం సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. హేమలతకు ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్ యాదవ్ శాలువా కప్పి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

● **అమావాస్య పూజలు:** సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో అమావాస్య పురస్కరించుకుని మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు.

ప్రశాంతత కోసమే ధ్యానకేంద్రం

● 23న ఎమ్మెల్యే కేఈ, స్వామిజీ సదానందగిరి చేతుల మీదుగా ప్రారంభోత్సవం

తుగ్గలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలన్న ఉద్దేశంతో దాత సింగంశెట్టి గురునాథ్ రూ.40 లక్షలతో ధ్యానకేంద్రం నిర్మించారు. మంగళవారం మండల పరిధిలోని బోడుబండలో నూతనంగా నిర్మించిన ధ్యాన కేంద్రాన్ని ఉప్పర్లపల్లి సింగిల్ విండో అధ్యక్షులు అప్పావేణుగోపాల్, టీడీపీ నాయకులు పరిశీలించి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విశిష్టత కలిగిన బోడుబండ ఫక్కీరప్ప స్వామి సన్నిధిలో ఇలాంటి ధ్యాన కేంద్రం నిర్మించడం ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ ఈ ధ్యాన కేంద్రంలో ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందాలన్నారు. 23 వతేదీన ధ్యాన కేంద్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, సదానందగిరి స్వామీజులు హాజరవుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు.

వాల్మీకులను కించపరిచి మాట్లాడితే సహించం

పత్తికొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను కించపరిచేలా రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడితే సహించబోమని బోయ వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్షులు అంజి హెచ్చరించారు. సోమవారం స్థానిక బీవీఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం మహేంద్రనాయుడు అధ్యక్షతన జరిగింది. రాముడు, శీను, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: వాల్మీకులను కించపరిస్తే వైసీపీ నాయకులకు రాజకీయంగా పుట్టగతులు ఉండవని వెల్దుర్తి మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు,వాల్మీకి సంఘం నాయకులు సూదపల్లె జయరాముడు అన్నారు. శివరాముడు, గుండ్ల మల్లాపురం బ్రహ్మయ్య నాయుడు, అమకతాడు సుదాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు ఎమ్మెల్యేకు తగదు



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు

దేవనకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వైకుంఠం జ్యోతి పై ఎమ్మెల్యే విరుపాక్షి అసత్య ఆరోపణలు చేయడం తగదని టీడీపీ కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు అన్నారు. నరేంద్ర మోడీతో వాల్మీకుల గురించి ఎమ్మెల్యే వినతిపత్రం ఇచ్చిన్నట్లు అసత్యలపై జ్యోతి నిలదిస్తే, వాల్మీకుల గురించి మాట్లాడిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఏడాదిన్నరగా అసెంబ్లీకి వెళ్లకుండా ప్రభుత్వ వేతనాలు తీకుంటున్న ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు మానుకొని, ఆలూరు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. రామారావునాయుడు,మల్లయ్య, ఉచ్చీరప్ప, ఆకుల వీరేష్, సర్పంచులు భాస్కర్, మహేశ్వరరెడ్డి, రాజశేఖర్‌గౌడ్, శాంతికుమార్ ఉన్నారు.

దళితుడిపై దాడి

ఆదోని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం బైచిగేరికి చెందిన దళితుడు మాదాసుల రంగస్వామిపై అదే గ్రామానికి చెందిన కూటమి నాయకులు వీరాసింగ్ పాటు మరో మహిళ దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలివీ.. గ్రామంలో మాదాసుల రంగస్వామికి 2.65 శెంట్ల భూమి ఉంది. కొన్ని సంవత్సరాలుగా ఈ భూమిలోని 70శెంట్లకు పైగా భూమిని వీరాసింగ్, భగవాన్‌సింగ్‌లు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేలో వీరు సాగు చేస్తున్న అక్రమ భూ దందా బయట పడింది. దీంతో అధికారుల ఆదేశాల మేరకు అక్రమ భూమిని బాధితునికి అప్పజెప్పారు. ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకొన్న వారు మంగళవారం ఉదయం పొలంకు వెళ్తున్న మాదాసుల రంగస్వామిని కులం పేరుతో దూషించి ముక్కుమ్మడిగా దాడి చేశారు. గాయాలపాలైన అతన్ని బంధువులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. ఔట్ పోస్టు పోలీసుల సమాచారం మేరకు తాలుక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలకు ప్రోత్సాహమందిస్తాం

ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. మంగళవారం ఆలూరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో సెపక్‌తక్రా శిక్షణ శిబిరాన్ని ఆమె ఆరంభించారు. ఈ సందర్భంగా గోవాలో జరగనున్న జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు ఆమె క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఆలూరుకు పేరు తీసుకురావాలన్నారు. అలాగే క్రీడల వల్ల ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సరికొత్త ఆటను ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఈటీ హనుమంతరెడ్డి, వెంకటేశ్వర, రాఘవేంద్ర, కళాశాల కరస్పాండెంట్ కెంజుండప్ప మాధవరావు, హెచ్‌ఎం ప్రశాంతి, పీడీ భాను, సీనియర్ క్రీడాకారులు అశోక్‌కుమార్, శివకుమార్, మధు, సతీష్ పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఆలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలోని తమ స్వగృహం వద్ద బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసి పరిష్కారమయ్యే విధంగా చేస్తామన్నారు.

జీవితానికి నిలువుటద్దం పెన్నేటి కావ్యం



మాట్లాడుతున్న అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ గ్రామీణ జీవితానికి నిలువుటద్దం విద్వాన్ విశ్వాసం రచించిన పెన్నేటి పాట కావ్యమని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద, రచయిత డాక్టర్ ఎం హరి కిషన్ అన్నారు. మంగళవారం అక్షర శ్రీ జూనియర్ కళాశాలలో అరసం ఆధ్వర్యంలో విద్వాన్ విశ్వం జయంతి సభ జరిగింది.ప్రతి రచయిత వారిని స్పూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంగ్ మేఘనాథ్ రెడ్డి అరసం నాయకులు మల్లికార్జున, నాగన్న, సిద్దార్థ దశరథరాముడు, కేశవ, బ్యాంకు రవి పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగితే రోగాలు రావా..?


మురుగునీటిని పరిశీలిస్తున్న ఈవో

మద్దికెర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒకరోజు కాదు.. రెండు రోజులు కాదూ. నెల రోజుల నుంచి పంచాయతీ వారు వదిలే కొళాయిల నీరు తాగి కలుషితం కావడమే కాకుండా మురుగునీరు కూడా కలిసి దుర్వాసన వస్తున్నాయనీ, ఎలా తాగాలంటూ స్థానిక చర్చి వీధి కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను ప్రశ్నించారు. మంగళవారం మద్దికెర గ్రామంలోని చర్చివీధి, ఉప్పర వీధి ప్రాంతాలకు చెందిన ప్రజలు పంచాయతీ వారు వదిలిన వారు వదిలిన నీరును తీసుకువచ్చి పంచాయతి కార్యదర్శికి చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల నుంచి నీటిలో కలుషితమైన నీరు రావడం వల్ల దుర్వాసన వస్తుందన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ వెంటనే పైపులైన్ మరమ్మతులు చేసి మంచినీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో కాలనీవాసులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చంద్రమోహన్, ఉదయ్ కుమార్, రామాంజులు, తదితరులు ఉన్నారు.

లీకేజీ పైపునకు మరమ్మతులు

ఆలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలోని జీరవీధి కాలనీకి సరఫరా అయ్యే తాగునీటిలో డ్రైనేజీ నీరు కలిసి వస్తుండడంతో వార్డు సభ్యులు జీరాగౌడ్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య, ఏఈ రామ్‌లీలా, ఎంపీడీఓ మద్దిలేటిస్వామి ఆ వీధికి సరఫరా అయ్యే పైపులైన్‌ను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయించారు. ఎన్నో రోజుల నుంచి ఇలాగే కుళాయిలకు తాగునీరు సరఫరా అవుతుండడంతో అనారోగ్యాలబారిన పడుతున్నామని, ఎట్టకేలకు అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారని జీరాగౌడ్, కాలనీవాసులు తెలిపారు.

60, 61లను వెంటనే సవరించాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కరువు భత్యం ఉత్తర్వులు 60,61 లను వెంటనే సవరించాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జనవరి 2024 నుంచి రావాల్సిన 21 నెలల డీఏ బకాయిలు ఉద్యోగ విరమణ పొందిన నాడే చెల్లిస్తామని తెలపడం దారుణం అన్నారు. అరియర్స్ పీఎఫ్ జమ చేయాలని కోరారు. పెన్షనర్లకు సంబంధించిన డీఏ బకాయిలను కూడా 2027-28 ఆర్థికి సంవత్సరంలో 12 కంతుల్లో చెల్లిస్తామనడం అభ్యంతరకరమన్నారు. వెంటనే నగదు చెల్లించాలన్నారు.

సొంత డబ్బుతో పాఠశాల అభివృద్ధి


ఈదుల వెంకటరాముడిని సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల బాగుకోసం తన సొంత డబ్బులను ఖర్చుపెట్టి అభివృద్ధి చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది .మండలంలో గుంటుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఈదుల వెంకటరాముడు సొంత నిధులు రూ.20వేలు ఖర్చుచేసి స్వగ్రామంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలకు రంగులు వేయించాడు. మంగళవారం ఉపాధ్యాయుని నీరజ ఆధ్వర్యంలో ఈదుల వెంకటరాముడుకు పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సుధాకర్, శేషిరెడ్డి, శేషన్న, నారాయణ, కృష్ణ, శ్రీను,రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆధార్ సేవలు నిలిచిపోయాయి

మద్దికెర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలోని 3, 4వ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తుండేవారు. 4వ ఆధార్ కేంద్రంలో ప్రింటర్ చెడిపోయింది. మూడో సచివాలయంలోని ఆధార్ కేంద్రంలో ఆధార్ డిజిటల్ అసిస్టెంట్ ప్రమోషన్‌పై పది రోజుల క్రితం బదిలీ కావడంతో ఖాళీగా ఉంది. దీంతో ఆధార్ సేవలు నిలిచిపోయాయి. మంగళవారం ఆధార్ కేంద్రాల సచివాలయాల్లో ఉద్యోగులు లేకపోవడంతో చేసేదేమి లేక వెనుదిరిగి పోయారు. నిత్యం రద్దీగా ఉండే ఆధార్ కేంద్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల పని చేయడం లేదు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఆధార్ కేంద్రాలు నిలిచిపోయాయనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎంపీడీవో కొండయ్య మాట్లాడుతూ ఆధార్ కేంద్రాలనుప్రారంభిస్తామని తెలిపారు.

చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో వివిధ అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న వారికి సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అందజేశారు. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు రంగయ్య, ఉప సర్పంచ్ ఉరుకుంద, ఉప్పర అంపయ్య మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాలకు చెందిన 13మంది బాధితులకు రూ.6.57లక్షల చెక్కులను అందజే డం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీటీ శ్రీరాములు, రంగన్న, వీరభద్రి, బాధితులు పాల్గొన్నారు.

సీఆర్పీలదే ప్రధాన పాత్ర



మాట్లాడుతున్న అష్రఫ్

గోనెగండ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలకు తడి చెత్త, పొడి చెత్తలపై అవగాహన కల్పించడంలో ఆయా గ్రామాల సీఆర్పీలదే ప్రదాన పాత్ర అని కేంద్రం జిల్లా రిసోర్స్ పర్సన్ అష్రఫ్, ఎంపీడీవో మణిమంజరి అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని చెత్తసంపద తయారీ కేంద్రం దగ్గర గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం పెద్దకడుబూరు మండలాలకు చెందిన సీఆర్పీలకు ఒక్క శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ నుంచి సంపద తయారీ కేంద్రం జిల్లా రిసోర్స్ పర్సన్ అష్రఫ్, పద్మావతి, సునిత హాజరయ్యారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అనంతశయన, గ్రామ సర్పంచ్ హైమావతి పాల్గొన్నారు.

రైతుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రైతులు

గోనెగండ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముగోడు గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని ప్రభుత్వం పుట్టపాశం గ్రామానికి తరలించనుందని, ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని గ్రామ రైతులు వెంకటేష్, కృష్ణ, మహబుబ్‌బాషా, రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం వేముగోడు గ్రామ రైతులు అరగంట పాటు రోడ్డు పై ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రం కర్నూలుకు వెళ్లి కలెక్టర్ ఏ. సిరి కలసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అనంతశయన, గ్రామ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, పలు మండలాల సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరాలు'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తలపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరంలాంటివని టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలి అన్నారు. మంగళవారం నందవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు దీపావలి కానుకగా డీఏ ప్రటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఓర్వలేకనే వైసీపీ ఆరోపణలు చేస్తుందని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవుపలికారు. ప్రతి గ్రామంలో ఇళ్లలేని వారందరికీ ఇళ్లు నిర్మించేందుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, ఎల్ఐసీ గోపాల్, రామకృష్ణరెడ్డి, ఉదయ్‌గౌడు, బసప్ప, సామేలు, షరీఫ్ పాల్గొన్నారు.

సొంతూరికి సేవ చేయడం అభినందనీయం



మాట్లాడుతున్న డీఎస్పీ భార్గవి

మంత్రాలయం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరికి సేవా చేయాలన్న అంకిత భావంతో ఎం.తాండ గ్రామ ఎంప్లాయిస్ గ్రూపు సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి అన్నారు. మంగళవారం మాధవరం తాండ గ్రామంలో అదే గ్రామానికి చెందిన 40 మంది ఉద్యోగులు తాండ ఎంప్లాయిస్ గ్రూపుగా ఏర్పడి సొంత డబ్బులతో పలు సేవా కార్యక్రమాలతో పాటు, 5 కే మారథన్ రన్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ భార్గవి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఏఎస్ఐ కృష్ణనాయక్ పాల్గొని ప్లాస్టిక్ నివారణ కోసం 400 మందికి ఖరీదైన జూట్‌బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ గ్రూపు నాయకులు వెంకటప్ప, మహేంద్రనాయక్, రాజశేఖర్‌నాయక్, దుబాయ్‌రాజు, శేఖర్‌నాయక్, అమ్రేష్ నాయక్, లింగప్ప, గురునారాయణనాయక్, రంగనాయక్, చింతామణి, కామాక్షి, బాలాజీనాయక్, తిరుమలనాయక్ పాల్గొన్నారు.

నేడు మంత్రాలయానికి మంత్రుల రాక

మంత్రాలయం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి బోసురాజు, తెలంగాణ మంత్రి వాకిట శ్రీహరి బుధవారం మంత్రాలయంకు వస్తున్నట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాస రావు, ఎస్ఐ శివాంజల్ తెలిపారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని పూజలు చేయనున్నారు.

రియల్ దందా!



అనుమతులేకుండా వేసిన ప్లాట్



గ్రామాల్లో విచ్చలవిడిగా వెంచర్లు వెలుస్తున్నాయి. తక్కువ ధరకు పొలాలు కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. పొలాలను ప్లాట్లుగా విక్రయించాలంటే కుడా, పంచాయతీ అనుమతి తప్పనిసరి. ఇవేమీ పట్టించుకోకుండా రియల్ వ్యాపారులు దందా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అన్ని వసతులు కల్పిస్తామని, మీకు ఏమి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని అమాయకులకు మాయమాటలు చెబుతున్నారు. ప్లాట్లు అమ్ముడుపోయాక పత్తాలేకుండా పోతున్నారు. దీంతో లబ్ధిదారులు మోసపోయామని లబోదిబోమంటున్నారు. నందవరం మండలంలో ప్రతి గ్రామంలో ప్రస్తుతం ఇదే తంతు. పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడంతోనే రియల్ వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

- పుట్టగొడుగుల్లా వెంచర్లు
- అనుమతుల్లేకుండా ప్లాట్లు
- అక్రమ లే అవుట్లుకు తెర
- రూ.లక్షల్లో ధరలు
- పంచాయతీ తీర్మానం లేకుండానే ఇష్టారాజ్యంగా వ్యాపారం
- అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని లబ్ధిదారులకు కుచ్చు టోపీ

నందవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి, ధర్మాపురం, నాగలదిన్నె, పూలచింత గ్రామాల్లో వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పూలచింత పంచాయతీలో ఎల్‌పీ నెంబర్ 508లో, 1.29 ఎకరాలు ఓ రియల్ వ్యాపారి అడ్వాన్స్‌గా రూ 5లక్షలు ఇచ్చి అగ్రిమెంట్ రాయించుకున్నట్లు తెలుస్తుంది. దీంతో దాన్ని కోటి రూపాయలు తీసుకొని, ఆ స్థలంలో మొదట అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తామని నమ్మబలికి మాయమాటలు చెప్పి, ప్లాట్లు విక్రయించిన తర్వాత ఉడాయించాడు. దీంతో గ్రామస్థులు సెంటు లక్ష ప్రకారం కొనుగోలు చేసి మోసపోయామని ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకుని గ్రామ సర్పంచ్‌ను ఆశ్రయించారు. తాము ఎలాంటి ప్లాట్ల విక్రయాలకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. దీంతో ఎలా చేయాలని ఆలోచనలో పడ్డారు. ప్రతి గ్రామంలో ఇలాగే కొనసాగుతోంది.



పూలచింత గ్రామంలో ప్లాట్లుగా మారిన పొలం

పంచాయతీ అనుమతి: పంచాయతీ అనుమతి లేకుండనే ప్లాట్లు వేయరాదు. అన్ని సదుపాయాలు కావాలంటే ముందుగానే అనుమతి తీసుకోవాలి. కాని ఆ రియల్ వ్యాపారి ఎవరి అనుమతి లేకుండా స్థలంలో క్లీన్ చేయించి ప్లాట్లు వేశారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అంతే గాని ఏమి చేయలేదు.

కుడా పర్మిషన్ : కుడా పర్మిషన్ లేదు. పర్మిషన్ కావాలంటే అక్కడ మసీదు, దేవాలయం, చర్చి స్థలం కేటాయించాలి. అలాగే 40 పీట్స్ రోడ్డు, డ్రైనేజీ కోసం ముందే స్థలం వదలాలి. ప్లాట్లు వేసే ముందు ఈ పర్మిషన్లు తప్పని సరిగా ఉండాలి.

విద్యుత్ అధికారుల అనుమతి: కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి అక్కడ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి. అది కూడా అంచనా వేసి ప్రజలకు ఇబ్బంది లేని చోట స్తంభాలు నిలబెట్టాలి. కానీ వారి అనుమతి లేదు.

> అందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం. అందరికీ ఇబ్బంది లేకుండా చూస్తాం అన్నారు. ప్లాట్లు వేశారు. తర్వాత ఉడాయించారు. అధికారుల అనుమతి కూడా ఉందన్నారు. మేము వెళ్లి సర్పంచ్‌ను అడిగితే ఎక్కడ ప్లాట్లు వేశారో లేదో తనకు తెలియదని చెబుతున్నాడు.
>
> **ఎలీయా, బాధితుడు**

> ఈ విషయంపై సర్పంచ్ అక్కామాంబాదేవి వివరణ కోరగా తమ దృష్టికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. గ్రామస్తులు వచ్చి అడిగారు. తమ అనుమతి లేదని చెప్పాం. తమ దగ్గరికి వచ్చి రాతపూర్వకంగా ఇస్తే వారిపై ఫిర్యాదు చేస్తాం.

> పంచాయతీ అధికారి జ్యోతిని వివరణ అడగ్గా ఈ విషయంపై నోటీసులు రెండు సార్లు ఇచ్చినా పొలం యజమాని తీసుకోలేదు. మీపై అధికారులతో మాట్లాడతానని చెప్పారు. ఇంతవరకు ఎవరితో మాట్లాడలేదు. ఎవరి అనుమతి తీసుకోకుండా ప్లాట్లు వేసుకున్నాడు. అధికారులకు కూడా ఫిర్యాదు చేశా.

యువతికి పాము కాటు

కోసిగి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 3వ వార్డు దళిత కాలనీకి చెందిన జి.అఖిల మంగళవారం సజ్జలగుడ్డం గ్రామం చెందిన రైతు పత్తి పొలంలో పత్తి తీసేందుకు కూలీకి వెళ్లింది. అయితే పత్తి పనులు చేస్తుండగా.. ఆ యువతికు పాము కాటేయడంతో అస్వస్థతకు గురైంది. వెంటనే స్థానిక కూలీలు, కుటుంబ సభ్యులు కోసిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు సమ్మెలో ఉండగా.. విధుల్లో ఉన్న దంత వైద్యురాలు డా.మౌనిక స్టాఫ్ నర్సు సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ ఉదయ్ ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆసుపత్రికి తరలించారు.

రైతుకు అస్వస్థత

కోసిగి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌కు చెందిన యువ రైతు గుర్రాల ఈరన్న మంగళవారం తమ పొలంలో మిర్చి పంటకు మందు పిచికారి చేసి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆదోని ఆసుపత్రికి తరలించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

మంత్రాలయం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యానగర్, పరమాన్‌దొడ్డి తాండ గ్రామంలో ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదోని డివిజనల్ స్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్‌పోటీలను ఆదోని డివిజన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కవిరాజు, పీడీలు ఖలీల్, హెచ్‌ఎం రామాంజనేయులు, లక్ష్మీకాంత్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నరసింహరాజు, సతీష్, నరసింహులు, గోపాల్, రాజారామ్, సురాజ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి తీవ్ర గాయాలు

కోసిగి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న దర్శనార్థం మండలంలోని చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన మాధవరం లచ్చిరెడ్డి భార్య సునీత, ఏడు నెలల చిన్నారి లాస్యతో కలిసి బైక్ వెళ్తున్నారు. ఉరుకుంద నుంచి కోసిగి వస్తున్న కర్నాటక బళ్లారికు చెందిన కారు బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదంలో ఏడు నెలల చిన్నారి లాస్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కోసిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా డెంటల్ డాక్టర్ మౌనిక, ఫార్మసిస్టు సులోచన, స్టాఫ్‌నర్సు సరస్వతి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలించారు.

ఘనంగా పోలీసుల సంస్మరణ దినం




రక్తదానం చేసిన ఎస్ఐ శ్రీనివాసులుకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎస్పీ

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీసులు రక్తదానం చేశారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు కార్యక్రమంలో డీఎస్పీ భార్గవి మాట్లాడారు. 50 మంది పోలీస్ సిబ్బంది, ప్రజలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు మధుసూధన్ రెడ్డి, శ్రీనివాసులు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున, ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల: పోలీసు అమరవీరులు త్యాగాలు మరువలేనివని గోనెగండ్ల సీఐ విజభాస్కర్ అన్నారు. గోనెగండ్లలో మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు ర్యాలీ చేపట్టారు.

మంత్రాలయం చేరుకున్న పీఠాధిపతి

మంత్రాలయం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటన ముగించుకుని సోమవారం మంత్రాలయంకు చేరుకున్నారు. ఈనెల 14వ తేదీన తన శిష్యబృందంతో కలిసి తమిళనాడులోని శ్రీరంగంకు బయలు దేరి వెళ్లారు. ధార్మిక పర్యటన ముగించుకొని 20న సోమవారం మంత్రాలయంకు చేరుకున్నారని మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి శ్రీపతి అచార్ తెలిపారు.



మాచుమాన్ దొడ్డి పరిధిలో నీటితో కళకళలాడుతున్న పెర్క్యులేషన్ ట్యాంకు

మసీదుపురంలో తవ్విన పారంఫాండ్‌లో నిండుగా వర్షం నీరు

- నీటితో కళకళలాడుతున్న నీటికుంటలు, చెక్‌డ్యాంలు
- వాటర్ షెడ్‌తో పెరుగుతున్న భూగర్భజలాలు
- ఆనందంలో రైతులు

జలకళ



ఎమ్మిగనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వాటర్ షెడ్ గ్రామాలైన కందనాతి, కడివెళ్ల పరదిదిలో తవ్విన వాటర్‌షెడ్, పారం ఫాండ్స్, పెర్క్యులేషన్ ట్యాంకులు నీటితో కళకళలాడుతున్నాయి. వంకల్లోను, పొలాల దగ్గర నీరు నిలువ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు పొలాల్లో వేసుకున్న బోర్లలలో నీరు సమృద్ధిగా ఉంటుంది. పారం ఫాండ్స్‌లో నీరు నిలువ ఉండటంతో వల్ల ఆయా గ్రామాల్లో రైతులకు చెందిన పశువులకు తాగునీటికి ఇబ్బంది లేదు. ఎమ్మిగనూరు మండలంలోని కందనాతి, కడివెళ్ల గ్రామాల పరిధిలోని కందనాతి, మసీదుపురం, వెంకటగిరి, మాచుమాన్ దొడ్డి, కడివెళ్ల, ఎస్ నాగలాపురం గ్రామాల్లో వాటర్ షెడ్ కింద 2023నుంచి ఇప్పటి వరకు దాదాపు 150వరకు పారంఫాండ్స్, ఆయా గ్రామాల పరిధిలోని వంకలపై 10కి పైగా చెక్‌డ్యాంలు, నాలుగు పెర్క్యులేషన్ ట్యాంకులు (అమృత్ సరోవర్‌లు) నిర్మించారు. ప్రస్తుతం ఇవన్నీ వర్షం నీటితో కళకళలాడుతున్నాయి.

వాటర్‌షెడ్‌తో ఎంతో మేలు



మా గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం రావటంతో రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. కందనాతి, కడివెళ్ల గ్రామాల పరిదిలో వాటర్‌షెడ్‌కింద నీటి కుంటలు, చెక్‌డ్యాంలు నిర్మించటం వల్ల వర్షం నీరు నిలిచి కళకళలాడుతున్నాయి. వంకల్లో నీరు నిలువటం వల్లనీటికుంటల వల్ల బోర్లలో నీరు బాగా వస్తున్నాయి. వేసవిలో రైతులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

- కేశన్న, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్, కందనాతి, ఎమ్మిగనూరు మండలం